సాక్షి అనకాపల్లి

శనివారం । 2 । మార్చి । 2024



గ్రామాలకు మహర్దశ IIలో

మంత్రి అమర్‌నాథ్ కశింకోట మండలంలో రూ.3.5 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.



పట్టాభిషేకం IIలో

డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలు, రైతులకు భూ హక్కు, భూరక్ష పట్టాలు పంపిణీ చేశారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 33.6, కనిష్టంగా 25 డిగ్రీలు, తేమ 84 శాతం నమోదవుతాయని, గాలి గంటకు 6 కి.మీ.వేగంతో వీస్తుందన్నారు.



ప్రగతి పరవళ్లు

ఐదేళ్లలో రూపురేఖలు మారిన భీమిలి

- వైఎస్సార్ సీపీ పాలనలో రెండు చక్రాలుగా అభివృద్ధి, సంక్షేమం
- రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా రూ.2,550 కోట్ల లబ్ధి
- కొత్తగా సమకూరిన మౌలిక సదుపాయాలు
- దీర్ఘకాలిక సమస్యలకూ పరిష్కారం



భీమిలి బీచ్‌రోడ్డు



వేములవలసలో ఒకేచోట గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

మట్టి వాసనతో చక్కటి గ్రామీణం.. ఆధునిక పోకడలతో అందమైన పట్టణం.. ఇదే భీమిలి నియోజకవర్గం. చరిత్రలో భీమిలి పేరు సువర్ణాక్షరాలతో లిఖితమైంది. భీమిలి నియోజకవర్గంలో 1952 నుంచి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ నియోజకవర్గంలో 2019 వరకు 67 ఏళ్ల కాలంలో వివిధ పార్టీల హయాంలో జరిగిన అభివృద్ధి కంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత 2019–2024 మధ్య కాలంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టింది. 33కు పైగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ.2,550 కోట్ల వరకు లబ్ధి చేకూరింది. ఐదు లక్షల పైగా జనాభా కలిగిన అతి పెద్ద నియోజకవర్గం భీమిలిలో అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఈ మొత్తం జమ అయింది. మరో రూ.2వేల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి.

– తగరపువలస



తొట్లకొండపై పునర్ నిర్మించిన బౌద్ధ మహా స్థూపం

ఒక్కొక్కరికి రూ.లక్ష పైనే లబ్ధి

నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సగటున సంక్షేమ పథకాల ద్వారా రూ.51,008, ఓటర్‌కు రూ.101,008 లబ్ధి చేకూరగా.. అభివృద్ధి పనులతో కలిపి ఒక్కొక్కరికి రూ.72,305, ఓటర్‌కు రూ.143181 ప్రయోజనం చేకూరింది.

చకచకా రోడ్ల విస్తరణ

గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చారు. పద్మనాభం నుంచి రెడ్డిపల్లి శాంతి నికేతన్ వరకు రూ.10.40 కోట్లతో మూడు కిలో మీటర్ల మేర రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. భీమిలి అర్బన్, రూరల్ ప్రాంతాలు.. కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, బీటీ రోడ్లతో కళకళలాడుతున్నాయి. జీ–20 సదస్సు సందర్భంగా భీమిలి బీచ్‌రోడ్లకు కొత్త అందాలు వచ్చి వెలిగిపోతున్నాయి. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకీకరించారు.



కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు రహదారి

పార్కులు భళా

ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు గానూ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. మధురవాడ జోన్‌లో రూ.6 కోట్లతో మూడు చోట్ల థీమ్ పార్కులను అందుబాటులోకి తీసుకొచ్చారు. భీమిలి జమ్మి చెరువు పార్కును రూ.84లక్షలు, బీచ్ పార్కును రూ.25 లక్షలతో ఆధునికీకరించారు. జీవీఎంసీ భీమిలి జోన్‌లోని 1 నుంచి 4 వార్డులకు కలిపి 182 పనులకు రూ.34.59 కోట్లు ఖర్చు చేశారు. మధురవాడ జోన్‌లోని 5 నుంచి 8 వార్డులకు గానూ 492 పనులు మంజూరు కాగా.. రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశానవాటికలు, ప్రహరీలు, రక్షణగోడలు, బస్ షెల్టర్లు, ఫుట్‌పాత్‌లకు 108.44 కోట్లు ఖర్చు చేశారు.



భీమిలి జమ్మి చెరువు పార్కు

శ్మశానవాటికలకు కొత్త రూపు

శ్మశానవాటికలను కూడా నందనవనంలా తీర్చిదిద్దుతున్నారు. ప్రహరీలు నిర్మించి వసతులు కల్పిస్తున్నారు. ఇటీవల భీమిలి జోన్‌లో రూ.1.09 కోట్లతో నాలుగు శ్మశానవాటికల్లో వసతులు పూర్తి చేశారు.

47 సచివాలయాలు.. 45 ఆర్బీకేలు



మద్ది ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్

స్వపరిపాలనలో భాగంగా రూ.14.95 కోట్లతో 47 గ్రామ సచివాలయాలు, రూ.9.81 కోట్లతో 45 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. భీమిలిలో రూ.75 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రైతుల ప్రయోజనార్థం ఏర్పాటు చేశారు. మధురవాడ జోన్‌లో వసంత విహార నుంచి జీసీసీ లే అవుట్ వరకు రూ.3 కోట్లతో, సాండ్ అండ్ సాండ్ లే అవుట్ నుంచి బక్కన్నపాలెం వరకు రూ.1.40 కోట్లతో డ్రైనేజీ నిర్మించారు. కాపులుప్పాడలో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.4 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 2వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గొడౌన్‌ను రూ.1.20 కోట్లతో నిర్మించారు.

జ్యూట్ మిల్లు కార్మికులకు రూ.33 కోట్ల పరిహారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భీమిలి డివిజన్‌లో ప్రజలకు అందుబాటులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. 2009లో చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్‌కు గురి కాగా.. అప్పటి కాంగ్రెస్, తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాలు ఈ సమస్యను పరిష్కరించలేకపోయాయి. 2019లో వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జోక్యంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆరు వేల మంది కార్మికులకు పరిష్కారం చూపారు. ఇప్పటివరకు యాజమాన్యం నుంచి రూ.33 కోట్లకు పైగా పరిహారం ఇప్పించారు. నాలుగు దశాబ్దాల ప్రజల కలను నెరవేర్చేలా రూ.78 లక్షలతో చిట్టివలసలో రైతు బజార్‌ను నిర్మించారు. సత్యనారాయణపేట కొండవాలు ప్రాంతంలో రూ.74 లక్షలతో రక్షణ గోడ ఏర్పాటు చేయించారు. భీమిలి జోన్ ప్రజల తాగునీటి సమస్య తీర్చడానికి రూ.1.27కోట్లతో 350 ఎంఎం పైప్‌లైన్ నిర్మించారు. తొట్లకొండపై రూ.1.50 కోట్లతో మహా స్థూపం పునర్ నిర్మాణం, వసతులు కల్పించారు.





సొంతింటి కల నెరవేరిందిలా..

నియోజకర్గంలో 35 వేల మందికి ఇంటి పట్టాలు అందించారు. వీటి మార్కెట్ విలువ రూ.10.50 కోట్లకు పైనే ఉంటుంది. జగనన్న కాలనీల్లో విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలకు అదనంగా ఖర్చు చేశారు. ఇంకా ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల చొప్పున రుణసాయం అందిస్తున్నారు. ఇప్పటి వరకు 534 మందికి టిడ్కో ఇళ్లు అందించారు. మిగిలినవి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు.







ఆరోగ్య భద్రతకు పెద్దపీట

రూ.3.60 కోట్లతో భీమిలిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించారు. నియోజకవర్గంలో రూ.8.21కోట్లతో 8 పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించి, 3 పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అత్యాధునికంగా తీర్చిదిద్దారు. మరో 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రూ.2.68 కోట్లతో ఆధునికీకరించారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.6.3 కోట్లతో 36 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. నాడు–నేడు కింద 247 పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీల నిర్మాణం, 58 అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు.

సంక్షేమ పథకాలల్లోనూ అగ్రగణ్యం

భీమిలి నియోజకవర్గంలో సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఇప్పటివరకు అందిన మొత్తం వివరాలివీ..

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య	ఐదేళ్లలో చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
రైస్ కార్డులు జారీ	1,18,565	
వైఎస్సార్ ఆరోగ్యశ్రీకార్డులు	87,997	
వైఎస్సార్ బీమా కార్డులు	1,01,444	
వైఎస్సార్ పింఛన్ కానుక	45,575	282.93
ఇళ్ల పట్టాలు	35,000	1050.00
వైఎస్సార్ రైతు భరోసా	24,925	112.62
అమ్మఒడి	4,4617	202.89
జగనన్న విద్యా దీవెన	10,763	102.31
జగనన్న వసతి దీవెన	9,462	29.4
వైఎస్సార్ చేయూత	31,626	181.64
జగనన్న చేయూత(దర్జీ)	1,605	6.40
జగనన్న చేయూత(రజకులు)	1,263	5.00
జగనన్న చేయూత (నాయీబ్రాహ్మణులు)	801	3.20
వైఎస్సార్ వాహనమిత్ర	5,404	21.61
కోవిడ్–19 ఆసరా	97,734	9.77
పాస్టర్లకు గౌరవ వేతనం	189	0.37
అగ్రిగోల్డ్ బాధితులకు చెల్లింపు	6151	12.30
జగనన్న గోరుముద్ద	33,067	32.40
వైఎస్సార్ కంటి వెలుగు	42,901	
వైఎస్సార్ ఆసరా	53,533	155.85
సున్నా వడ్డీ	61,458	22.39
వైఎస్సార్ బీమా పరిహారం	470	5.85
జగనన్న తోడు	12,165	24.64
స్త్రీనిధి	6,390	40.12
వైఎస్సార్ కాపు నేస్తం	1,344	6.65
ఈబీసీ నేస్తం	2,611	6.84
బ్యాంకు లింకేజీ రుణాలు	27,012	197.65
జగనన్న విద్యాకానుక	44,617	32.12
మత్స్యకార భరోసా	5,191	5.19

సంతృప్తికరంగా ఐదేళ్ల పాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో భీమిలి నియోజకవర్గంలో ఈ ఐదేళ్లు ప్రజలకు సంతృప్తికరంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించగలిగాను. నియోజకవర్గంలోని 127 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తిరిగి 3.50 లక్షల ఓటర్లను ప్రత్యక్షంగా కలిశాను. వారి సమస్యలు విని పరిష్కరించాను. ప్రభుత్వం ప్రతీ సచివాలయానికి ఇచ్చిన రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి చేశాం. చిట్టివలసలో రైతు బజారును ప్రారంభించాం. పాండ్రంగి వద్ద గోస్తనీనదిపై వంతెన, అనంత పద్మనాభస్వామి ఘాట్‌రోడ్డు పనులు పూర్తి చేస్తాం. సింహాచలం పంచ గ్రామాల సమస్య కోర్టు పరిధిలో ఉంది. ఈ సమస్యను కూడా ముఖ్యమంత్రి చొరవతో పరిష్కరించి అక్కడి ప్రజలకు న్యాయం చేస్తాను.

– ముత్తంశెట్టి శ్రీనివాసరావు, భీమిలి ఎమ్మెల్యే

డీవీఎస్ రాజుకు అభినందనల వెల్లువ

ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం



చైర్మన్‌గా నియమితులైన సూర్యనారాయణరాజుకు అభినందనలు తెలుపుతున్న పాయకరావుపేట సమన్వయకర్త కంబాల జోగులు, పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ, వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు

నక్కపల్లి/కోటవురట్ల: మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఎస్‌ఎంఈడీసీ) చైర్మన్‌గా నియమితులైన డి.వి.సూర్యనారాయణరాజు శుక్రవారం విజయవాడలోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి వెళ్లిన పలువురు నేతలు, అభిమానులు బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొని అభినందనలు తెలిపారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు దాదాపు 4 లక్షల ఎంఎస్‌ఎంఈలు రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటయ్యాయన్నారు. సుమారు 30 లక్షలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయన్నారు. అచ్యుతాపురం, పరవాడ, గాజువాక వంటి ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటైన చోట ఇటువంటి ఎంఎస్‌ఎంఈలు ఎక్కువగా స్థాపించి ఉపాధి పొందుతున్నారన్నారు. జగనన్న తనపై ఉంచిన నమ్మకంతో వీలైనన్ని ఎక్కువ ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేసేందుకు కార్పొరేషన్ ద్వారా కృషి చేస్తానన్నారు. సూర్యనారాయణరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్‌ఎస్ రామచంద్రరాజు (చంటిబాబు), ఇన్‌లాండ్ వాటర్‌వేస్ కార్పొరేషన్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, పాయకరావుపేట ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు శుభాకాంక్షలు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి హయాంలో డి.వి.సూర్యనారాయణరాజుకు 2009లో ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కూడా తంగేడు రాజులపై అదే ఆదరాభిమానాలను చూపిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజుకు మళ్లీ పదవి వెతుక్కుంటూ వచ్చింది.

టిడ్కో గృహాల నిర్మాణంలో అయ్యన్న దోపిడీ

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శ
- సచివాలయాల వారీగా నేటి నుంచి ఇళ్ల పంపిణీ

IIలో

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష IIలో

8,400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం IIలో



ఇంటర్ పరీక్షలు ప్రారంభం



నర్సీపట్నం: నోటీసు బోర్డులో రూమ్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



అనకాపల్లి: ఆదినారాయణ మహిళా కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 38 కేంద్రాల్లో మొత్తం 14,090 మందికి 13,624 మంది పరీక్షలు రాసినట్టు ఇంటర్మీడియట్ జిల్లా విద్యా శాఖాధికారి కె.సుజాత చెప్పారు. 466 మంది గైర్హాజరయ్యారన్నారు. జనరల్ విద్యార్థులు 11,380మందికిగాను 11,080 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,710 మందికిగాను 2,544 మంది పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 29 కేంద్రాలు, పట్టణంలో 9 కేంద్రాల్లో పరీక్షలు జరిగినట్లు చెప్పారు. శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమవుతాయి. జనరల్ విద్యార్థులు 12,708 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,590 మంది దరఖాస్తు చేసినట్టు ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పలు పరీక్ష కేంద్రాలను సందర్శించి, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, బందోబస్తును పరిశీలించారు.



యలమంచిలి: పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ఉన్నత చదువులకు ఊతం



విద్యాదీవెన నమూనా చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

- రూ.26.54 కోట్ల విద్యా దీవెన నిధులు విడుదల
- జిల్లాలో 39,773 మంది విద్యార్థులకు ప్రయోజనం

తుమ్మపాల: జిల్లాలో 39,773 మంది విద్యార్థులకు 26 కోట్ల 54 లక్షల 2 వేల 727 రూపాయల విద్యాదీవెన నగదును వారి తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేసినట్లు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విద్యాదీవెన కార్యక్రమంలో నమూనా చెక్కును కలెక్టర్ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల ఫీజుల కోసం ప్రభుత్వం ప్రతి ఏటా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ఈ పథకాన్ని వినియోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహ సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యాదీవెన పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మీరందరూ పెద్ద చదువులు చదివి ఉన్నత స్థానాలకు చేరడమే జగనన్నకు చెప్పే కృతజ్ఞత అన్నారు. అంతకుముందు కృష్ణా జిల్లా పామర్రు నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన నగదు పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కె.రాజేశ్వరి, ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, ఏటీడబ్ల్యూవో నాగశిరీష, పాల్గొన్నారు.

కేటగిరీ	విద్యార్థులు	లబ్ధి
బీసీ	31,589	రూ.21.22 కోట్లు
ఈబీసీ	1,372	రూ.1.09 కోట్లు
కాపు	2,962	రూ.1.83 కోట్లు
ఎస్సీ	3,078	రూ.1.96 కోట్లు
ఎస్టీ	537	రూ.27.39 లక్షలు
మైనారిటీ	235	రూ.16.94 లక్షలు

గ్రామాలకు మహర్దశ

- సీఎం జగన్ పాలనలో పల్లెలు కళకళ
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



తాళ్లపాలెంలో డ్రైనేజ ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, పక్కన మలసాల భరత్‌కుమార్

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రూ.3.5 కోట్లతో కశింకోటలోని గవర పేట, మేదర వీధి, కోమటి వీధి, ఉప్పునీటి దిబ్బ తదితర ప్రాంతాల్లో నిర్మించిన సిమెంట్ రోడ్లు, తాళ్లపాలెంలో నిర్మించిన సచివాలయం-2 భవనం, ఎన్టీఆర్ కాలనీలో సిమెంట్ కాలువలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలను గతంలో ఎన్నడూలేని విధంగా అమలు చేసి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయకేతనం ఎగుర వేయడానికి సంపూర్ణ సహకారం అందించాలన్నారు. కశింకోటలోని వెలమ పేట గౌరీపరమేశ్వరులను మంత్రి అమర్‌నాథ్ దర్శించి పూజలు చేశారు. తాళ్లపాలెంలో సచివాలయ ప్రారంభోత్సవంలో అమర్‌నాథ్‌ను గజమాలతో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, సర్పంచ్ మంత్రి జయరజని, తదితరులు పాల్గొన్నారు.



కశింకోట కోమటి వీధిలో సిమెంట్ రోడ్డు ప్రారంభం

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

తుమ్మపాల: ఈనెల 7న జిల్లాలో జరిగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంత్రం ఆయనతోపాటు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ వెబ్‌ఎక్స్‌లో వర్చువల్‌గా సమావేశమయ్యారు. జిల్లా అధికారులకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. పిసినికాడ గ్రామ సమీపంలో ఎంపిక చేసిన స్థలంలో పూర్తి స్థాయి పనులు చేపట్టాలన్నారు. హెలిపాడ్ నిర్మాణం, సభాస్థలి ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం పనులు చేపట్టాలన్నారు. సభా ప్రాంగణంలో హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక దళం సిద్ధంగా ఉండాలన్నారు. అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు పట్టాభిషేకం



కె.కోటపాడు: లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దేవరాపల్లి: బోయిలకింతాడ రైతులకు భూ హక్కు, భూరక్ష పట్టాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి

జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

కె.కోటపాడు: పేదలందరికీ ఇళ్ల పథకంలో జగనన్న లేఅవుట్లలో ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులకు రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులను కల్పిస్తున్నట్లు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చెప్పారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన పట్టాలను కె.కోటపాడులో లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అందించిన ఇంటి స్థలాలకు లబ్ధిదారుల పేరున రిజిస్ట్రేషన్ చేసిన దాఖలాలు లేవని అన్నారు. అక్కచెల్లెమ్మలకు ఇది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్న కానుక అన్నారు. తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ మాట్లాడుతూ లబ్ధిదారులైన 435 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూ హక్కు, భూరక్ష పట్టాలు పంపిణీ

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భూముల రీ సర్వేతో ఏళ్ల తరబడి వేధిస్తున్న భూ సమస్యల నుంచి రైతులకు మోక్షం లభించిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. రీసర్వే పూర్తయిన బోయిలకింతాడ గ్రామానికి చెందిన 980 మంది రైతులకు పట్టాలు మంజూరయ్యాయి. తారువలో డిప్యూటీ సీఎం శుక్రవారం పట్టాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వందేళ్ల తర్వాత దేశంలోనే ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యాధునిక సాంకేతికతతో భూ సర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. భవిష్యత్‌లో డూప్లికేట్ రిజిస్ట్రేషన్లకు, భూ ఆక్రమణలకు తావు లేకుండా యజ్ఞంలా భూ రికార్డుల ప్రక్షాళన చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, బోయిలకింతాడ సర్పంచ్ బూరె బాబురావు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎంఎస్ఎంఈ పార్కుకు ప్రారంభోత్సవం

అనకాపల్లి : మండలంలోని కోడూరు గ్రామంలో 70 ఎకరాల్లో నిర్మించిన ఎంఎస్ఎంఈ పార్కును మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బీవీ సత్యవతి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

అనకాపల్లి చేరుకున్న కేంద్ర పోలీసు దళాలు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ఉత్తర్వుల మేరకు అనకాపల్లి పట్టణానికి కేంద్ర పోలీసు దళాలు చేరుకున్నట్లు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. వారికి స్థానిక ప్రభుత్వ కళాశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంతోపాటు ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు, వాహన తనిఖీలు, తదితర విధులు నిర్వహించేందుకు కేంద్ర బలగాల సేవలు వినియోగిస్తామన్నారు.



పోలీసు దళాలతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

8,400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

అనకాపల్లి, కాకినాడ జిల్లాల సెబ్ పోలీసుల సంయుక్త దాడులు

సాక్షి, అనకాపల్లి: ఎన్నికల నేపథ్యంలో సెబ్ పోలీసులు నాటు సారాయి బట్టీలపై విస్తృత దాడులు నిర్వహించారు. కాకినాడ, అనకాపల్లి జిల్లాల సెబ్ పోలీసులు జరిపిన సంయుక్త దాడుల్లో పాయకరావుపేట మండలం ఈదటం గ్రామ సమీపంలో ఒక కేసులో 1600 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. సరిహద్దు కాకినాడ జిల్లా తుని సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తొండంగి మండలం వేమవరం గ్రామ సమీపంలో 4 కేసుల్లో 6,800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. అనకాపల్లి సెబ్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ షేక్ మీరా సాహెబ్, సెబ్ ఎస్సై మహమ్మద్ అలీ, పాయకరావుపేట సెబ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎస్.ధర్మారావు, తుని సెబ్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.చిట్టిబాబు, ఎస్సై వినయ్ ప్రతాప్ ఈ దాడుల్లో పాల్గొన్నారు.



సెబ్ పోలీసులు పట్టుకున్న సారా బట్టీలు

అమ్మకాల్లో దూసుకుపోతున్న మహిళా మార్ట్

ఎస్.రాయవరం : అడ్డురోడ్డులో ప్రారంభమైన మహిళా మార్టులో మొదటి రెండు రోజుల్లోనే రూ. 2 లక్షల 81 వేల వ్యాపారం జరిగినట్టు డీఆర్‌డీఏ పీడీ కె.సత్యదేవి తెలిపారు. శుక్రవారం ఆకస్మికంగా మార్టును తనిఖీ చేశారు. ఇక్కడ దొరికే నాణ్యమైన వస్తువుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇంత వరకు జిల్లాలో 5 మార్టులు ప్రారంభించామన్నారు. ఈ మార్టులో అనుకున్న స్థాయిలో వ్యాపారం జరిగితే మరిన్ని ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. ఆమె వెంట ఏరియా కోఆర్డినేటర్ సత్యవేణి, స్త్రీనిధి మేనేజర్ కరుణానిధి, ఏపీఎం శివప్రసాద్ తదితరులు ఉన్నారు.



అడ్డురోడ్డు మహిళా మార్టులో వస్తువులను పరిశీలిస్తున్న పీడీ సత్యదేవి

టిడ్కో గృహాల నిర్మాణంలో దోపిడీ

- కాంట్రాక్టర్‌ను బెదిరించి నిధులు కాజేసిన అయ్యన్న
- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ విమర్శ
- సచివాలయాల వారీగా నేటి నుంచి టిడ్కో గృహాలు పంపిణీ చేస్తామని వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: టిడ్కో గృహాల నిర్మాణంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు దోపిడీకి పాల్పడ్డారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. బలిఘట్టం వద్ద రూపుదిద్దుకుంటున్న టిడ్కో గృహాలను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల సొమ్మును అయ్యన్నపాత్రుడు సొంతింటి నిర్మాణానికి మళ్లించడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. టిడ్కో కాంట్రాక్టర్‌ను బెదిరించి రూ.10 కోట్లు కాజేయడంతో కాంట్రాక్టర్ గృహాలను పూర్తి చేయలేకపోయాడన్నారు. టిడ్కో గృహాల నిర్మాణానికి 2018 జనవరి 17న టెండర్ ప్రక్రియ జరిగిందన్నారు. 2019 మే నెల నాటికి మొత్తం గృహాలను పూర్తి చేయాల్సి ఉందన్నారు. 17 నెల వ్యవధిలో గృహాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారో అయ్యన్నపాత్రుడు సమాధానం చెప్పాలన్నారు. మున్సిపాలిటీలో రూ.6 కోట్లతో ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మిస్తే అయ్యన్న తట్టుకోలేకపోతున్నాడన్నారు. ఈ రోడ్డును అనుకొని ఉన్న చెరువును వైఎస్సార్ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతానన్నారు. రూ.3 కోట్లతో ఈ రోడ్డు నిర్మిస్తానని శిలాఫలకం ఆవిష్కరించిన అయ్యన్నపాత్రుడు రోడ్డు వేయకుండానే నిధులను మింగేశాడన్నారు. సచివాలయాల వారీగా లబ్ధిదారులకు శనివారం నుంచి టిడ్కో గృహాలను పంపిణీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కమిషనర్ రవిబాబు, మెప్మా సిబ్బంది, కౌన్సిలర్లు ఉన్నారు.

భార్య, కుమార్తెపై హత్యాయత్నం

అనుమానంతో నిప్పు పెట్టిన కిరాతకుడు

మాకవరపాలెం: భార్యపై అనుమానంతో పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. గాజువాకకు చెందిన తంగళ్ల రమణతో మండలంలోని రాచపల్లికి చెందిన విజయకు 2008లో వివాహం అయింది. 2021 వరకు వారు రాచపల్లిలోనే కలసి నివాసం ఉన్నారు. అనంతరం ఇతరులతో వివాహేతర సంబంధం ఉందంటూ రమణ భార్యను మద్యం తాగి వచ్చి వేధించడం మొదలు పెట్టాడు. దీంతో వీరు దూరంగా ఉన్నారు. గురువారం సాయంత్రం రమణ రాచపల్లి వచ్చి జయతో గొడవపడి వెళ్లాడు. మరలా రాత్రి 11 గంటల ప్రాంతంలో వచ్చి కిటికీలో నుంచి పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. దీంతో భార్య విజయ, చిన్న కుమార్తె కావ్యశ్రీలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు విజయ ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన చిన్నారి కావ్యశ్రీ

ఏప్రిల్ 25న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

తుమ్మపాల: ఏప్రిల్ 25న జరిగే ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ చెప్పారు. డీఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ పోస్టర్‌ను ఆమె శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకులాల్లో విలువలతో కూడిన విద్య, ఉచిత వసతి, సంరక్షణ, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. ఉన్నత పాఠశాల విద్యకు ఏపీఆర్‌జే కేట్ ఇంటర్మీడియేట్, డిగ్రీలకు ఏపీఆర్‌జేసీ డీసీ సెట్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 31 వరకు http://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షలు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో జరుగుతాయని వెల్లడించారు.

నర్సీపట్నం ఏపీఆర్‌జేసీ (బాలురు) ప్రిన్సిపాల్ వి.వి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నర్సీపట్నంలో బాలుర, విజయనగరం జిల్లా తాటిపూడిలో బాలికల విద్యాలయాలు ఉన్నాయన్నారు. నర్సీపట్నంలోని బాలుర గురుకుల విద్యాలయంలో 5వ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు, 6, 7, 8 తరగతులకు ఖాళీలను బట్టి సీట్లు ఉంటాయన్నారు. ఏపీఆర్‌జే కేట్ పరీక్షలు ఉదయం, ఏపీఆర్జేసీ డీసీ సెట్ పరీక్షలు మధ్యాహ్నం జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి ప్రిన్సిపాల్ డి.ప్రమీలాదేవి పాల్గొన్నారు.



గురుకుల విద్యాలయాల పోస్టర్‌ను ఆవిష్కరించిన డీఈవో వెంకటలక్ష్మమ్మ

క్లుప్తంగా

కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

అనకాపల్లి : ఏపీ ల్యాండ్ పూలింగ్ యాక్టు–2023 చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని స్థానిక న్యాయ సముదాయం వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయిలక్ష్మణ్‌రావు మాట్లాడుతూ సుమారు 62 రోజులు దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కనిశెట్టి సురేష్‌బాబు, నాగలక్ష్మి, రోజా, రాపేటి రామారావు, కోడూరు అప్పలరాజు, కిరణ్, శరగడం నూకరాజు, గౌరీశంకర్, కేవీ నాయుడు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డాక్యుమెంట్ల అందజేతకు ఏర్పాట్లు

అనకాపల్లి : జీవీఎంసీ జోన్ పరిధిలో అర్హులైన 4,126 మంది జగనన్న గృహ లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని జెడ్సీ ఒమ్మి అయప్పనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి డాక్యుమెంట్లు తమ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. రెండు రోజుల్లో లబ్ధిదారులకు డాక్యుమెంట్ పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మిగిలిన లబ్ధిదారులందరూ త్వరతగతిన రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణం అభినందనీయం

తుమ్మపాల : అనకాపల్లి – అచ్యుతాపురం రోడ్డును పునర్నిర్మించాలని చేసిన పోరాటం విజయవంతమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. వి.వి. శ్రీనివాసరావు, ఆర్. రాము, గంటా శ్రీరామ్ తదితరులతో కలిసి మాట్లాడారు. ఏళ్ల తరబడి అధ్వానంగా తయారైన రోడ్డును ప్రభుత్వం ఇప్పటికైనా నిర్మించనుండడం అభినందనీయమన్నారు. రూ.6.5 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో చేపడుతున్న పనులు వేగవంతం కావాలన్నారు. రోడ్డు నిర్మాణం అనంతరం భారీ వాహనాలు రాకుండా చూడాలని, ఎస్‌ఈజెడ్, ఫార్మా కంపెనీలకు వెళ్లే భారీ వాహనాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

కశింకోట : రానున్న ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి సహకరించాలని సీఐ ఎం. వినోద్ బాబు కోరారు. మండలంలోని విసన్నపేట గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 5,709 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,640	4,530
మొదటి రకం	3,490	4,270
రెండో రకం	3,400	3,890
మూడోరకం	3,000	3,520

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్‌వాలంటైన్	:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	:	షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
నాగదీపం	:	వెంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
భారీ 111	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు, బీ పాజిటివ్–26 యూనిట్లు, ఓ పాజిటివ్–6 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 436 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 378 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

జగనన్న సురక్ష.. ఆరోగ్య రక్ష

- బయ్యవరం శిబిరంలో 411 మందికి వైద్య సేవలు
- ఉచిత పరీక్షలు.. మందుల అందజేత



వైద్య శిబిరానికి హాజరైన రోగుల పేర్లు నమోదు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



రోగులను పరీక్షిస్తున్న కశింకోట పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు

కశింకోట : మండలంలోని బయ్యవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 411 మందికి వైద్య సేవలందించారు. వీరిలో ఎక్కువగా మహిళలు 222 మంది సేవలను వినియోగించుకున్నారు. మిగిలిన వారిలో 171 మంది పురుషులు,18 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 49 మందికి కంటి పరీక్షలు నిర్వహించి నలుగురికి క్యాటరాక్టు ఆపరేషన్లు, 28 మందిని కళ్లద్దాలకు, నలుగుర్ని ఉన్నత వైద్యానికి సిఫార్సు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. రోగులు ఉత్సాహంగా హాజరై పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 320 మందికి బీపీ పరీక్షలు, 334 మందికి రక్త శాతం పరీక్షలు, నలుగురికి ఈసీజీ పరీక్షలు జరిపారు. అనంతరం వీరికి ప్రత్యేక వైద్యులు టి.శ్వేత, నితిన్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు హాజరై రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆప్తాల్మిక్ సంధ్య కంటి పరీక్షలు జరిపారు. బయ్యవరం సచివాలయ పరిధి నుంచి ఎక్కువ సంఖ్యలో రోగులు హాజరయ్యారు.



మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరైన రోగులు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాలమిస్ట్ సంధ్య

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



చైతన్య-1 కళాశాల వద్ద వేచి ఉన్న విద్యార్థులు



చైతన్య కళాశాల వద్ద పరీక్ష రాసేందుకు వేచి ఉన్న విద్యార్థులు

అనకాపల్లి : ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు పట్టణంలో పలు పరీక్షా కేంద్రాల్లో శుక్రవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం 8 గంటలకు పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు పరుగులు తీశారు. స్థానికంగా శ్రీచైతన్య–2, నారాయణ–2, సాయికుల్వంత్, హిమశేఖర్, సంయుక్త, ఆదినారాయణ మహిళా, ఏఎంఏఎల్ కళాశాలలను విద్యాశాఖ అధికారులు పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు 8 గంటలకు ముందే హాజరు కావడం కనిపించింది. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా పరీక్షా కేంద్రాల వద్ద తమ పిల్లలు పరీక్షా రాసేవారకు వేచి ఉన్నారు.

గురుకుల పాఠశాలలో..

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ఏపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి ఏడాది పరీక్షలు ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి 417 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇక్కడ చదివే విద్యార్థులకు జంబ్లింగ్ విధానం కావడం వల్ల యలమంచిలి, కొక్కిరాపల్లి వెళ్లి పరీక్షలు రాశారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గూనురు చినఅప్పారావు

తుమ్మపాల : రెక్కాడితే గాని డొక్కాడని జీవితం.. వృద్ధాప్యం మీద పడుతున్నా బతకడానికి జీవనాధారం లేక పక్క గ్రామంలో పంచాయతీ కార్మికుడు (స్వీపర్)గా పని చేస్తు జీవనం సాగిస్తున్న గూనురు చినఅప్పారావు (63) రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. మండలంలో శంకరం గ్రామానికి చెందిన గూనురు చిన అప్పారావు సమీపంలో ఉన్న రేబాక గ్రామంలో పంచాయతీ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం శంకరంలో తన ఇంటి నుంచి జాతీయ రహదారి మీదుగా రేబాక గ్రామానికి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు నుజ్జునుజ్జు అయింది. స్థానికులు గమనించి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాలు పూర్తిగా నుజ్జు కావడంతో తొడ వరకు తొలగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ చొరవ చూపి మెరుగైన వైద్యం అందించేందుకు సహాయం చేయాలని వారు కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌లో 8 అర్జీల స్వీకరణ

అనకాపల్లి: జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పోలీస్ సిబ్బంది హాజరై వారి సమస్యలపై ఎస్పీ మురళీకృష్ణకు వినతులు అందజేశారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను విన్నవించుకున్నారు. మొత్తం 8 అర్జీలు వచ్చాయి. ఎస్పీ వినతులను పరిశీలించి, అర్హతగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవానికి ఏర్పాట్లు

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) ఉత్సవం శనివారం పెద్ద ఎత్తున నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని అందంగా అలంకరించిన రథంపై నేల వేషాలు, మహిళల కోలాటాలు, ఆర్కెస్ట్రాతో బాణాసంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్ర కథ, భరత్ అనే నేను మెగా డ్యాన్స్, డూప్స్ బాబోయ్ డూప్స్, రేలా రేలా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, ఆకర్షణీయమైన విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశామన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి

అనకాపల్లి : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ బోర్డుతో కార్మికులకు భరోసా దక్కిందని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వై.ఎన్.భద్రం అన్నారు. మామిడిపాలెంలో శుక్రవారం జరిగిన కార్మిక సమావేశంలో ఆయన మాట్లాడారు. బోర్డును ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్మికులకు ఎటువంటి సంక్షేమం లేకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి కార్మికుల సంక్షేమ బోర్డును తిరిగి ప్రవేశపెట్టి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షుడు గోపాలం మహాలక్ష్మి, మిత్తిపాటి కాశి అప్పారావు, అప్పలకొండ, పీలా వెంకటరావు, కరణం సత్తిబాబు, పీలా ఈశ్వరరావు, ఏఐటీయూసీ నాయకులు చెల్లూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసింగబిల్లిలో..

కశింకోట : మండలంలోని నరసింగబిల్లిలో భవన నిర్మాణ కార్మికులు తమకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. సంక్షేమ బోర్డు ద్వారా మృతులు, ప్రమాదంలో గాయపడిన భవన నిర్మాణ కార్మికులకు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ మేరకు సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక యూనియన్ అధ్యక్షుడు ఎం. రమణ, కార్యదర్శి ఎం. గోవింద పాల్గొన్నారు.

నాణ్యత.. స్వచ్ఛతపై అవగాహన

అనకాపల్లి : స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామ పంచాయతీలకు బీఐఎస్, నాణ్యమైన ఉత్పత్తులను సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎలా కొనుగోలు చేయాలి, ఐఎస్ఐ మార్కు అంటే ఏమిటి, గోల్డ్ హాల్ మార్కింగ్ గురించి అవగాహన సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఇనిస్టిట్యూట్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ జిల్లా సహాయ సంచాలకులు చంద్రశేఖర్, విజయవాడ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వివేక్‌వర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఏ ఉత్పత్తులు భారతీయ ప్రమాణాలు కలిగి ఉన్నాయి, ఏ ఉత్పత్తులకు తప్పనిసరిగా ఐఎస్ఐ గుర్తు ఉండాలన్న అంశాలు తెలిపారు. 4వ తేదీ వరకు సదస్సు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

టైలర్లను ఆదుకున్నది జగనన్నే



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంది మహేష్

కశింకోట : టైలర్లను ఆదుకోవడానికి జగనన్న చేదోడు పేరిట ఏటా రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించడం ఆనందదాయకమని న్యూ నవ్యాంధ్ర రాష్ట్ర టైలర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అంది మహేష్ అన్నారు. కశింకోట వచ్చిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను శుక్రవారం కలిసి టైలర్ల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆదరణ కరవైన దర్జీలను జగనన్న చేదోడు పథకంతో ఆదుకున్నారన్నారు. దర్జీ ఫెడరేషన్ ఏర్పాటు ద్వారా టైలరింగ్ వృత్తికి ముఖ్యమంత్రి గుర్తింపు ఇచ్చారని, ఇందుకు రుణపడి ఉన్నామని కృతజ్ఞతలు తెలిపారు. అలాగే 50 ఏళ్లు నిండిన దర్జీలకు పింఛన్, 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితంగా అందివ్వాలని, వృత్తి పరికరాల కొనుగోలుకు వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, ఆరోగ్య బీమా, జీవిత బీమా సదుపాయాలు కల్పించాలని మంత్రికి అందజేసిన వినతిపత్రంలో కోరారు.

వీఆర్‌వోలకు స్థానచలనం

మునగపాక : మండలంలో పలు సచివాలయాల్లో సేవలందిస్తున్న వీఆర్వోలను మండల పరిధిలోని ఇతర సచివాలయాలకు ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తహసీల్దార్ బి.పాపారావు తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు, పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు వేగవంతమయ్యేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉమ్మలాడ వీఆర్వోగా పని చేస్తున్న పి.సురేష్‌ను మునగపాక–2కు అలాగే వాడ్రాపల్లి వీఆర్వో సీహెచ్ జయకృష్ణను మునగపాక–1కు, మునగపాక వీఆర్వోగా పని చేస్తున్న పి.హిమబిందును నాగులాపల్లి–1కు, నాగులాపల్లి–1 వీఆర్వో తరుణ్‌ను గంటవానిపాలెం సచివాలయానికి ఇన్‌చార్జిలుగా నియమించినట్లు పాపారావు తెలిపారు.

ఘనంగా శ్రీసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపుగా వెండి కిరీటం తీసుకు వస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: పెద ఉప్పలం గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొశెట్టి వెంకటరమణ రూ. 30 వేల ఆర్థిక సహాయంతో 300 గ్రాముల వెండి కిరీటం స్వామికి అందజేశారు. గ్రామంలో శెట్టిబలిజ వీధిలో నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిలిపిన శ్రీసిద్ధి గణపతి వార్షికోత్సవ వేడుక ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు గ్రామంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



లోకావారి వీధిలో మంత్రి సన్యాసమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్



మల్లిమణుగుల వారి వీధిలో మంచంపై ఉన్న వృద్ధురాలు పింఛన్ అందుకున్న దృశ్యం

అనకాపల్లి : జోన్ పరిధిలో శుక్రవారం వృద్ధులు, వికలాంగులకు 75 శాతం వృద్ధాప్య పింఛన్లు అందజేసినట్లు జోన్ ఏపీడీ వి.కె.దొర తెలిపారు. 10,128 మందికి గాను 75 శాతం లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా పింఛన్లు అందజేశామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు ఇతరులకు ప్రభుత్వ పింఛన్ అందజేసినట్లు తెలిపారు.

రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులకు శ్రీకారం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న గొర్లి సూరిబాబు, సన్యాసమ్మ

తుమ్మపాల : సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని రేబాక గ్రామంలో సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన గురజాడనగర్ సీసీ డ్రైనేజీ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వాటితో పాటు అభివృద్ధి పనులతో గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సుమారు రూ.1 కోటి నిధులు ఖర్చు చేసి సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ కేంద్రం, అంగన్‌వాడీ, మిల్క్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంటింటికీ కుళాయిలు, సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గ్రామపంచాయతీ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి గురజాడనగర్ శ్రీకృష్ణుని ఆలయం నుంచి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వరకు సీసీ డ్రైనేజీ చేపడుతున్నట్లు సర్పంచ్ మార్టూరు సన్యాసమ్మ తెలిపారు. రేబాక – గోపాలపురం రోడ్డుపై మురుగు నీరు నిర్మూలన దిశగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి సత్తిబాబు, మార్టూరు భాస్కరరావు, వార్డు సభ్యురాలు చందక లక్ష్మమ్మ, పంచాయతీ కార్యదర్శులు వి.ఈశ్వరరావు, బి.రామకృష్ణ, స్థానికులు పాల్గొన్నారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలో తగరంపూడి పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పొలం పనులు చేసుకునే రైతులు, ఇతర వర్గాల ప్రజలు వడదెబ్బతో ఆస్పత్రికి వస్తారని, వారికి సకాలంలో తగిన వైద్యం చేయాలన్నారు. మౌలిక సదుపాయాల కోసం ఆస్పత్రికి కావలసిన సామగ్రిని తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. ఆస్పత్రి ప్రహరీ చుట్టు మొక్కలు నాటి, స్వచ్ఛమైన వాతావరణం కోసం కృషి చేయాలన్నారు. ఎంపీడీవో పీవీవీఎం మోహన్‌రావు, వైద్యులు జి.పావని, డి.నీలిమరాణి, వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, ఎంపీటీసీలు పన్నీరు కొండలరావు, జోగా నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ గుర్తింపు దక్కడం గర్వకారణం



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నాగభూషణం

అనకాపల్లి : రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమన గేయానికి యునెస్కో ద్వారా ప్రపంచ ఉత్తమ జాతీయ గీతంగా గుర్తింపు రావడం మనకు గర్వకారణమని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక గొల్లవీధి జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జనగణమనపై శుక్రవారం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంతకు ముందు జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పట్నాల కృష్ణమోహన్, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమరాజు, కొత్తుర్తి రామారావు, పాఠశాల హెచ్ఎం మహేశ్వరి, ఉపాధ్యాయులు కె.వరలక్ష్మి, పి.కోమలి, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లి : మండలంలో పిసినికాడ గ్రామంలో ఈనెల 7న జరగనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో వివేకానంద ఫంక్షన్ హాల్లో శుక్రవారం స్వయం సహాయక సంఘాల రిసోర్స్ పర్సన్లతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆమె కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత పార్టీ శ్రేణులు, నాయకులపై ఉందన్నారు. గడుస్తున్న ఐదేళ్లలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మన ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక పథకాలు అమలు చేసి సీఎం జగన్ వారికి తోడ్పాటునందించారని పేర్కొన్నారు. దిశ యాప్‌ను పోలీస్‌స్టేషన్లలో ప్రవేశపెట్టడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది దానిని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఆమె తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలకు దిశ యాప్ వరం వంటిదన్నారు. పేదోడి సొంతింటి కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని సంక్షేమాభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. అంతకు ముందు 82వ వార్డు పరిధిలో ఆర్పీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.